భావితరాలకు గురువులు మార్గదర్శకులు

ఎన్జీరంగా వర్సిటీలో వేడుకలు

గుంటూరు రూరల్: భావితరాలకు గురువులు మార్గదర్శకులని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్. శారదజయలక్ష్మిదేవి తెలిపారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం లాంఫాం నందున్న విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ అత్యంత క్రమశిక్షణ, ఉత్తమ విలువలు కలిగిన ఉపాధ్యాయుడని కొనియాడారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జి. రామచంద్రరావు, అగ్రికల్చర్ డీన్ సీహెచ్. శ్రీనివాసరావు, పీజీ డీన్ ఎ.వి. రమణ, కమ్యూనిటీ సైన్స్ డీన్ బి. శ్రీలక్ష్మి, స్టూడెంట్ అఫైర్స్ డీన్ జి. కరుణాసాగర్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ పి.వి. సత్యనారాయణ, ఎక్స్‌టెన్షన్ డైరెక్టర్ జి. శివన్నారాయణ, సీఈవో డి. సంపత్‌కుమార్, కంట్రోలర్ బి.వి.ఎస్. ప్రసాద్, ఎస్టేట్ ఆఫీసర్ పి.రవి, లైబ్రేరియన్ పి. సాంబశివరావు పాల్గొన్నారు.

విజ్ఞాన్ యూనివర్సిటీలో ..

చేబ్రోలు: సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఉపాధ్యాయులు సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ, విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతో పాటు విలువలు కూడా నేర్పించాల్సిన బాధ్యత ఉందని సూచించారు. వైస్ చాన్స్‌లర్ పి. నాగభూషణ్ మాట్లాడుతూ సమాజంలోనే అత్యున్నత వృత్తి ఉపాధ్యాయ వృత్తేనని పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పలు క్రీడా కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇంచార్జి రిజిస్ట్రార్ పీఎంవీ రావు, గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్ పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో మహిళా కళాశాలలో..

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరికీ క్రమశిక్షణతో కూడిన వ్యక్తిత్వానికి భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మార్గదర్శకుడని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సి. సంధ్య తెలిపారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గోరంట్లలోని సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న వీసీ

గురువు స్థానం గౌరవప్రదం

ప్రత్తిపాడు: గురువు స్థానం గౌరవప్రదమైనదని మలినేని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె. అప్పారావు అన్నారు. రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక మలినేని లక్ష్మయ్య మహిళా కళాశాలలో పాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అధ్యాపకులను సత్కరించారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ ప్రొఫెసర్ కిషోర్ బాబు, కళాశాల డైరెక్టర్ డాక్టర్. డి. శ్రీనివాస్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రత్యేక నృత్యాలు, గీతాలు, స్కిట్స్ ద్వారా గురువుల గొప్పదనాన్ని వివరించారు.

● శ్రీసరస్వతి రామా కోచింగ్ సెంటరులో నిర్వాహకులు పోపూరి రామాంజనేయులు ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుడు సత్యమూర్తి ఇంటికి వెళ్లి విద్యార్థులు గురువు పాదాలపై పూలు చల్లుతూ స్వాగతించారు. అనంతరం ఆయన్ను ఘనంగా సత్కరించారు.



సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మలినేని కళాశాల ప్రిన్సిపల్ అప్పారావు, అధ్యాపకులు

● ప్రత్తిపాడు రామానగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతిరాణిని చిన్నారులు, వారి తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు.

ఉపాధ్యాయులతోనే సామాజిక మార్పు సాధ్యం

కాకుమాను: ఉపాధ్యాయులతోనే సామాజిక మార్పు సాధ్యమని ఎంఈవో కె.ఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయినులను సన్మానించారు. అధ్యాపక వృత్తి నుంచే దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న పొందిన భారతదేశ మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చలపతిలో వేడుకలు

గుంటూరు రూరల్: విద్యార్థులకు దిశా నిర్దేశం చేసి భవిష్యత్ తరాలకు మంచి పౌరులను అందించేది గురువులని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్ తెలిపారు. లాంలోని కళాశాలలో గురువారం గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ డాక్టర్ జె. లక్ష్మీనారాయణ, డాక్టర్ ఎ. బాలాజీ, కె. వెంకటరామారావు, నాగగోపిరాజు, జె. భార్గవ్, డాక్టర్ ఎ. రాధాకృష్ణమూర్తి, డాక్టర్ డి. తిరుపతినాయుడు పాల్గొన్నారు.

గురువే ప్రత్యక్ష దైవం

గుంటూరు రూరల్: ప్రతి వ్యక్తికీ గురువే ప్రత్యక్ష దైవమని రిటైర్డ్ ఎంఈఓ అన్నమనేని మోహనరావు తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రిటైర్డ్ ఎంఈఓ మోహనరావు మాట్లాడుతూ రాధాకృష్ణన్ జీవితం ప్రతి విద్యార్థికీ ఆదర్శనీయమని తెలిపారు. సమాజంలో గురువులే మార్గదర్శకులని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని పేర్కొన్నారు. అధ్యాపకులు మాత్రమే దేశ సౌభాగ్యానికి మార్గదర్శకులని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎం. విజయ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

పెదకాకాని: భవిష్యత్ తరాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని సిబార్ దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎల్. కృష్ణప్రసాద్ అన్నారు. సిబార్ దంత వైద్య కళాశాల స్టూడెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన మహనీయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని కొనియాడారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్ఆర్ఐ వైద్య కళాశాల ప్రిన్సిపల్ శివప్రసాద్ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అనే అంశంపై మాట్లాడారు. ముందుగా భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ టి. కృష్ణమోహన్, గౌరవ అతిథి, జాతీయ దంత వైద్య మండలి సభ్యురాలు డాక్టర్ రేవతి, ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటరమణారెడ్డి, వైస్ డీన్ డాక్టర్ మన్నె ప్రకాష్, డాక్టర్ బి నగేష్, క్వాలిటీ అష్యూరెన్స్ కోఆర్డినేటర్ డాక్టర్ వై. మమత, అధ్యాపకులు పాల్గొన్నారు.



సిబార్ దంత వైద్య కళాశాలలో అధ్యాపకుడిని సత్కరిస్తున్న డీన్ కృష్ణప్రసాద్ తదితరులు



చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న యాజమాన్యం



ఆర్‌వీఆర్‌జేసీలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కళాశాల యాజమాన్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న చైర్మన్ లావు రత్తయ్య





సెయింట్ ఆన్స్‌లో కళాశాలలో నివాళులు అర్పిస్తున్న కళాశాల యాజమాన్యం, ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న ఎంఈవో కెనడీ

క్లుప్తంగా

వరద బాధితులకు ప్రజలు అండగా నిలవాలి



పెదకాకాని: వరద బాధితులకు ప్రజలు అండగా నిలవాలని నేస్తం వ్యవస్థాపకులు జలీల్ అహ్మద్ కోరారు. పెదకాకాని బాజీబాబా దర్గా ప్రాంతంలో వరద నీరు ప్రభావంతో ఇళ్లు మునిగాయి. గ్రామంలోని లూథర్‌గిరి కాలనీలోని పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్న బాధితులకు నేస్తం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి జలీల్ అహ్మద్ మాట్లాడుతూ తమ స్వచ్ఛంద సేవా సంస్థ పలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజల అవసరాలను తీర్చడంలో ముఖ్య భూమిక పోషిస్తోందని తెలిపారు. సభ్యుల సహకారాలతో వరద బాధితులకు మరికొన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నేస్తం సహ వ్యవస్థాపకులు టి. ధనుంజయరెడ్డి మాట్లాడుతూ జగమంత కుటుంబం నాది అనే భావన ప్రజలందరూ కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు రాజేంద్ర కుమార్, త్రిపురసుందర రావు, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ



పెదకాకాని: వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని తహసీల్దార్ టి. కృష్ణకాంత్ అన్నారు. పెదకాకాని పుచ్చలపల్లి సుందరయ్య కాలనీ, బాజీబాబా నగర్‌లోని వరద బాధితులకు గురువారం రాత్రి ఆయన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఒక్కొరికీ 25 కిలోల బియ్యం, కిలో పంచదార, కందిపప్పుతో పాటు ఉల్లిపాయలు, బంగాళదుంపలు, నూనె ప్యాకెట్ అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి నన్నపనేని శివాజీ, రెవెన్యూ సిబ్బంది,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆకలి తీర్చేందుకు కదిలిన అన్నదాతలు



ప్రత్తిపాడు: కన్నీటి సంద్రమైన విజయవాడను చూసి యావత్ ఆంధ్ర అయ్యో పాపం అంటోంది. వరద బాధితుల ఆకలి కేకలు గ్రామీణ ప్రాంత వాసులనూ కదిలిస్తున్నాయి. వరద బాధితుల ఆర్తనాదాలు వట్టిచెరుకూరు రైతులనూ కదిలించాయి. హలం పట్టి పొలం దున్నే హాలికులు సామాజిక బాధ్యతగా తీసుకుని బెజవాడలో ముంపు ప్రాంత వాసుల ఆకలి కేకలు తగ్గించడంలో ఉడతా భక్తిగా తమ వంతు సాయం చేయాలని అనుకున్నారు. స్వచ్ఛందంగా తలా కొంత చందాలు వేసుకుని వారికి ఆహారాన్ని సమకూర్చారు. రెండు క్వింటాల పులిహోర, 1500 పెరుగు ప్యాకెట్లు, 1800 వాటర్ బాటిల్స్, పాల ప్యాకెట్లు సిద్ధం చేశారు. వాటిని ప్యాకింగ్ చేసి గురువారం తెల్లవారుజామున ట్రాక్టర్‌పై విజయవాడకు తీసుకుని వెళ్లారు. అక్కడ అన్నమో రామచంద్రా ! అంటున్న వరద బాధితులకు ఆహారం ప్యాకెట్లు అందజేశారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



కోలా మణికంఠ



మండేపూడి పురుషోత్తం

నెహ్రూ నగర్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులుగా పలువురిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నియామక ఉత్తర్వులు గురువారం విడుదల చేసింది. గుంటూరు జిల్లాకు చెందిన ఇద్దరికి రాష్ట్ర అనుబంధ విభాగ అధ్యక్షులుగా నియమితులయ్యారు. కృష్ణ బలిజ/పూసల అధ్యక్షులుగా కోలా మణికంఠ, కుమ్మరి శాలివాహన రాష్ట్ర అధ్యక్షుడిగా మండేపూడి పురుషోత్తంను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రత్తిపాడు: పోషకాహారంతోనే చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో వి. సుజాతదేవి అన్నారు. పోషకాహార మాసోత్సవాలలో భాగంగా గురువారం ప్రత్తిపాడు సెక్టారు పరిధిలోని నిమ్మగడ్డవారిపాలెం, గొట్టిపాడు సెక్టారులోని వంగిపురం బిసి-4, ఓసీ-2 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంపై తల్లులు, మహిళలకు అవగాహన కల్పించారు. తొలుత చిన్నారులు వయసుకు తగ్గ బరువు ఉన్నారా లేదా అన్న విషయాలను పరిశీలించారు. అనంతరం సీడీపీవో మాట్లాడుతూ బిడ్డల పెరుగుదలను తల్లిదండ్రులు పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు. వయస్సు తక్కువ ఉన్న పిల్లలకు పోషక విలువలు మెండుగా ఉన్న ఆహారాన్ని అందించాలని సూచించారు.

నగల దుకాణంలో చోరీ

- భారీగా వెండి వస్తువులు అపహరణ
- దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగించిన స్థానికులు

పొన్నూరు: పొన్నూరులోని ఓ నగల దుకాణంలో బుధ వారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. బిహార్, రాజస్థాన్‌కు చెందిన ఆరుగురుకు పైగా దొంగలు దొంగతనానికి పాల్పడ్డారు. సేకరించిన వివరాల ప్రకారం పట్టణంలోని తోటమ్మ తల్లి ఆలయం వద్ద నగల దుకాణం షెట్టర్ తాళాలు పగలగొట్టి దొంగలు లోపలికి ప్రవేశించారు. భారీ మొత్తంలో వెండి వస్తువులు అపహరించారు. అయితే, దొంగతనం దృశ్యాలన్నీ షాపులోని సీసీ కెమెరాకు చిక్కాయి. సుమారు 35 కిలోల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు దుకాణ యజమాని తెలిపారు. పరిసరాల్లో వినాయక చవితి ఉత్సవాలకు మండపాలు సిద్ధం చేస్తున్న కొందరు యువకులు దొంగలను పసిగట్టారు. అర్ధరాత్రి ఇతర ప్రాంతాలకు చెందిన వారు సంచరిస్తున్నట్లు గమనించారు. వారిని వెంబడించి దొంగ సుమన్ కంతీని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. సంఘటన సమాచారం తెలుసుకున్న పట్టణ సీఐ రవి కిరణ్ తమ సిబ్బందితో కలిసి విక్రమ్‌సింగ్, ఉత్తమ్ సింగ్, ముకేష్‌మాలిలను వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. క్లూస్‌టీం సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించింది. అయితే, పనపాకం టోల్‌ప్లాజా వద్ద చంద్రగిరి పోలీసులు దొంగలను అదుపులోకి తీసుకొని పొన్నూరులో చోరీకి గురైన సొత్తుతో పాటు కారును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. చోరీ ఘటనలో ఎంత మంది దొంగలు ఉన్నారో పోలీసులు పూర్తిస్థాయి దర్యాప్తులో తేలాల్సి ఉంది.



దొంగను స్తంభానికి కట్టేసిన స్థానికులు

బజరంగ్ ఆధ్వర్యంలో మట్టి ప్రతిమల పంపిణీ



పంపిణీకి సిద్ధంగా ఉన్న మట్టి వినాయక ప్రతిమలు

కొరిటెపాడు: పర్యావరణ హితాన్ని దృష్టిలో పెట్టుకుని ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలని బజరంగ్ సీఈఓ అంబటి మురళీకృష్ణ గురువారం పిలుపునిచ్చారు. రానున్న వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఇతర రసాయనాలతో చేసిన వినాయక విగ్రహాలు కాకుండా, ప్రతి ఇంట్లోనూ మట్టి వినాయకుడి విగ్రహాలను పూజించాలన్నారు. మట్టి వినాయక విగ్రహాలను పూజించాలంటూ ఉద్యమం చేపట్టామన్నారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు పట్టాభిపురం గ్రీన్ గ్రేస్ ఆవరణలో ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ ద్వారా 6వేల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నామని వెల్లడించారు. పొన్నూరు మండలం మామిళ్ళపల్లి గ్రామంలో మరో వెయ్యి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నామని తెలిపారు. వినాయకపూజలు నిర్వహించబోయే వారందరూ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రజలందరూ వినాయక చవితి వేడుకలను ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.



అంబటి మురళీకృష్ణ

ఎన్‌సీసీ విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యం

గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్. ఎం. చంద్రశేఖర్

ప్రత్తిపాడు: ఎన్‌సీసీ విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో అవసరమని గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్. ఎం. చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధి లోని యనమదలకిట్స్ అక్షర్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం బీటెక్ మొదటి సంవత్సర విద్యార్థులకు ఎన్‌సీసీ ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. దీనికి హాజరైన గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్. ఎం. చంద్రశేఖర్, ఏవో దీపక్‌శర్మ హాజరయ్యారు. విద్యార్థులకు దేహదారుఢ్య, వ్యాయామ పరీక్షలు నిర్వహించి ఎంపికచేశారు. 24 ఏ బెటాలియన్ ఎన్‌సీసీలో ఖాళీలను భర్తీ చేసేందుకే ఎంపిక కార్యక్రమాన్ని జరిపినట్లు చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అభినందించారు. కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, డైరెక్టర్ గోగినేని సాంబశివరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రామకోటయ్య, కళాశాల ఎన్‌సీసీ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ బేగ్, ఆఫీసర్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఆశ్రమానికి నిత్యావసర వస్తువులు అందజేత

చేబ్రోలు: రిటైర్డు టీచర్ గాజులవర్తి హేమలత వర్ధంతి సందర్భంగా ఆమె కుటుంబసభ్యులు గురువారం పొన్నూరులోని సంతోషిమా కరుణాలయానికి (గోతాల స్వామి ఆశ్రమం) నిత్యావసర వస్తువులను అందజేశారు. 25కిలోల కందిపప్పు, 15కిలోల పెసరపప్పు, 5కిలోల నెయ్యి, 5కిలోల సేమ్యాలు, 5కిలోల శనగలు, చాక్లెట్లు తదితర సామగ్రిని అందించినట్లు హేమలత భర్త, రిటైర్డు హెచ్‌ఎం గాజులవర్తి సువర్ణకుమార్ తెలిపారు.

పెదకాకాని శివాలయం పాలకవర్గం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం పాలకవర్గం నియామకానికి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుతం సభ్యులుగా ఉన్న వారిలో గజ్జల సుబ్బాయమ్మ, గుమ్మళ్ళ వెంకట్రావు, చీడిపూడి అరుణ, మండాళ జ్యోతి, కారంకి శివనాగేశ్వరమ్మ, తోట రవీంద్రలు సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం పాలకవర్గం సభ్యత్వానికి తమ తమ రాజీనామాలు సమర్పించారు. ఇంకా ఆలయ చైర్మన్, ఐదుగురు సభ్యులు రాజీనామాలు చేయాల్సి ఉంది. గతంలో శివాలయం నుంచి ఈ రాజీనామాలపై దేవదాయ శాఖ కమిషనర్ నివేదిక పంపించారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం రాజీనామాలను ఆమోదిస్తూ గురువారం జీవో జారీ చేసింది. త్వరలో పెదకాకాని శివాలయానికి నూతన పాలకవర్గం నియామకం జరగనుంది.

వరద బాధితులకు ఎమ్మార్పీఎస్ చేయూత

చేబ్రోలు: విజయవాడలోని వరద బాధిత కుటుంబాలకు చేబ్రోలులోని చెరువులో పాలేనికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం చేయూత అందించారు. సుమారు 300మందికి ఆహారం, తాగునీటి బాటిల్స్‌ను ప్రత్యేకంగా ప్యాకింగ్ చేసి బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బాణాల శేఖర్, గంగవరపు పుల్లారావు, కారుమూరి వీరయ్య, పత్తిపాటి నాగేశ్వరావు, కే నరేష్, కే అరుణ్, దానియేలు, కె అనీల్ పాల్గొన్నారు.

ఇళ్లలో చోరీలకు పాల్పడే ఇద్దరు అరెస్టు

గుంటూరు రూరల్: ఇళ్లలో చోరీలకు పాల్పడే ఇద్దరును నల్లపాడు పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్‌లో గురవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పశ్చిమ విభాగం డీఎస్పీ పి. మల్లికార్జునరావు నిందితుల వివరాలను వెల్లడించారు. అడవితక్కెళ్ళపాడు న్యూరాజీవ్ గృహకల్పకు చెందిన ఉప్పల సురేష్, విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన కందివలస నరసింహారావు స్నేహితులు. మత్తుపదార్థాలకు, జల్సాలకు అలవాటుపడ్డారు. సులువుగా డబ్బు సంపాదించేందుకు చోరీలను ఎంచుకున్నారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన పలు చోరీకేసుల్లో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఐ వంశీధర్ దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు చోరీలకు పాల్పడినట్లు పలు ఆధా రాలు లభించాయి. రెక్కీ నిర్వహించి గోరంట్ల సమీపంలో గురువారం నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి ఐదు కిలోల వెండి, 28 గ్రాముల బంగారు వస్తువులు, రెండు స్కూటీలు, ఒక డీలక్స్ బండిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.



వివరాలను వెల్లడిస్తున్న పశ్చిమ డీఎస్పీ మల్లికార్జునరావు

డీవీసీ కాలనీవాసులకు సరుకుల పంపిణీ

పొన్నూరు: వర్షాల కారణంగా ఇళ్లు నీట మునిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్న డీవీసీ కాలనీ ప్రజలకు గురువారం అధికారులు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ ప్రశాంతి, డీఈ ఏడుకొండలు, సిబ్బంది, కూటమి నేతలు పాల్గొన్నారు.



స్థానికులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న అధికారులు, నాయకులు

● డీవీసీ కాలనీలో ఇళ్లలోకి చేరిన నీటి తొలగింపును మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు పరిశీలించారు. రెండు రోజుల నుంచి నిరంతరాయంగా మోటార్ల ద్వారా నీటిని తొలగించడంతో వీధుల్లో, ఇళ్లలో తగ్గుముఖం పట్టింది. వీధుల్లో పర్యటించి ప్రజల సమస్యలను ఆయన తెలుసుకున్నారు. పారిశుద్ధ్య పనులపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ B.P.T, B.Sc. MLT, DMLT, Med. Imaging, Anaesthesia, DRGA (RADIOGRAPHY), Cardio, Dialysis - Eligi : Inter Bi.P.C / Voc. MLT / DMLT / Any group. MGT Quota Seats - ASIAN - VJA. Ph : 79959 45835

SERVICES

■ ఫింగో ఎంటర్‌ప్రైజెస్ అన్ని రకాల వ్యాపార ప్రాజెక్ట్‌లను అందిస్తుంది వ్యక్తిగత, వ్యవసాయ, విద్య DMA స్వాగతం, జీతం+కమీషన్. ✆ 9266809540.

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 91699 22299

WANTED

■ సత్తెనపల్లిలో ప్రముఖ పాలిక్లినిక్ నందు డాక్టర్స్‌కి ఉచితముగా ఓ.పి ఇవ్వబడును. 9246480320

■ We are looking for(ANM or GNM) Senior Nursing Staff M & F with 2 or 3years Pediatric or ICU experience Receptionist with one year experience cont:6301115271

■ Wanted Girls aged 18-24 years to work as sales girls in a Jewellery Showroom, fruit market, Lalapet, Guntur ✆ 9700311201

■ 10th, ఇంటర్, డిగ్రీ, B.Tech చదివి ఖాళీగా ఉంటున్నవారికి ఆఫీసులు, షోరూమ్‌లు, షాపింగ్ మాల్స్, Ltd కంపెనీల్లో మా సంస్థ ద్వారా ప్లేస్‌మెంట్స్ కలవు. ఓన్లీ ఆఫీస్ వర్క్ ✆ 9963255441

■ ప్రముఖ విద్యాసంస్థలో పనిచేయుటకు మేల్ ఫిజికల్ ట్రైనర్స్ కావలెను. వయస్సు 25సంవత్సరాలు ఆపైన ఉండవలెను. ఎత్తు 5.8 ఆపైన ఉండవలెను. ఆకర్షణీయమైన జీతము మరియు ఉచిత భోజనం, వసతి కల్పించబడును. పనిచేయు ప్రదేశం: గుంటూరు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 8978480429

■ ప్రముఖ విద్యాసంస్థలో పనిచేయుటకు మేల్ జూనియర్ అకౌంటెంట్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతము మరియు అర్హతనుబట్టి PF మరియు ESI సదుపాయం కలదు. పనిచేయు ప్రదేశం : గుంటూరు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 8978480429

■ బాపట్ల లక్ష్మీ శ్రీనివాస సుజాత షోరూం నందు పనిచేయుటకు సేల్స్‌మెన్స్-4, మెకానిక్స్-4, హెల్పర్స్-2, సర్వీస్ అడ్వైజర్స్-3,కంప్యూటర్ ఆపరేటర్-1 కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత. 9246498115

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul: 10th- డిగ్రీ మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 77024 73949

■ నరసరావుపేట దగ్గర, ప్రముఖ ఆక్వా కంపెనీలో క్వాలిటీ కంట్రోల్ విభాగం నందు పనిచేయుటకు B.SC కెమిస్ట్రీ డిగ్రీ కలిగిన యువకులు కావలెను. బయోడేటా పంపవలసిన Mail Id:admin@valvin.in ఇంటర్వ్యూ తేది 10-09-2024 ✆ 96639 09856, 94414 84802

■ Rs. 5000/- జీతం, 10 to 2 PM చేయుటకు అనుభవం ఉన్న టెలీకాలర్స్ బ్యాంక్ అనుబంధ సంస్థలో కావలెను. గుంటూరు, కొరిటెపాడు రోడ్డు. Resume వాట్సాప్ చేయండి. Ph: 99666 34511

■ Wanted Audit Assistants / Accountants. Qua: B.Com / M.Com / MBA (Fin.) / CA / CMA Inter - SKVR & Associates, Plot No: 103, Fortune Towers, Near Manipal Hospitals, Guntur Dt. ✆ 89774 46166

■ Wanted Male and Female work for MNC company Qul 10th to degree sal 15k to 25k Cont: 9030612463 (Work from Home available)

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటి / వంట పనికి వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీవసతి+భోజనం .జీతం 20K.ఫోన్: 8977639662, 8977639663

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (3 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
గుంటూరు
7075167541
7075167663

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com